www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం జూన్ 27 2024
5
చిత్తూరు

డీఎస్సీ అభ్యర్థులకు వయోపరిమితి పెంచాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం జులై ఒకటో తేదీన డీఎస్సీ 2024 నోటిఫికేషన్ ప్రకటించింది. అందులో పరీక్ష రాస్తున్న అభ్యర్థులకు వయోపరిమితిని సడలించి 48 సంవత్సరాలకు పొడిగించాలని, ప్రభుత్వం డీఎస్సీ కోచింగ్ సెంటర్స్ ఏర్పాటు చేయాలని, నకిలీ కోచింగ్ సెంటర్స్ పైన చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయచంద్ర డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం డీఎస్సీ లేకపోవడం వల్ల చాలా మంది నిరుద్యోగులు వయస్సు అయిపోవడం వల్ల చాలా తీవ్రమైనటువంటి ఇబ్బందులకు గురవుతున్నారు. దాదాపు కోచింగ్ సెంటర్లలో లక్షల రూపాయలు ఖర్చుపెట్టి కోచింగ్ తీసుకున్నా, వయో పరిమితి దాటిపోవడంతో ఈ డీఎస్సీలో అప్లై చేసుకోలేకపోతున్నారన్నారు.వయో పరిమితిని 48 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. రేషనలైజేషన్ పేరుతో మూసివేసిన పాఠశాలలను తెరవాలని విజ్ఞప్తి చేశారు.

పేదరిక నిర్మూలనకు

కుప్పం నుంచే శ్రీకారం

- ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు తెస్తా
- మిల్క్, సిల్క్, హనీ ఉత్పత్తులకు ప్రాధాన్యత
- రెండో రోజు కుప్పంలో అధికారులతో సమీక్ష

సమావేశంలో జిల్లా అధికారులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

పేదరికం లేని గ్రామం, పేదరికం లేని మండలం, పేదరికం లేని నియోజకవర్గంగా ముందు కుప్పాన్ని తయారు చేస్తానని, గత పాలనకు, ఇప్పటికీ చాలా వ్యత్యాసం ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. అధికారులు ఫిజికల్‌గానూ, వర్చువల్‌గానూ పని విధానాలకు సిద్ధపడాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుప్పం నియోజకవర్గంలో రెండో రోజులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం కుప్పం అతిథిగృహంలో అధికారులకు దిశానిర్దేశం చేశారు. కుప్పంలో రౌడీయిజం, హింస, గంజాయి, అక్రమాలు ఎటువంటి పరిస్థితుల్లోనూ కనిపించకూడదన్నారు. రౌడీయిజం చేసేవారి పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించాలన్నారు. గత ఐదేళ్లు అధికారులు మనస్సు చంపుకుని పనిచేశారని, వైసిపి నేతల పైశాచిక ఆనందానికి కొందరు అధికారులు సహకరించారన్నారు. తన సొంత నియోజకవర్గానికి తాను రాలేని, మాట్లాడలేని పరిస్థితిని గత ఐదేళ్లలో కల్పించారన్నారు. తనపై హత్యాయత్నం కేసు పెట్టారన్నారు. 2019 వరకూ తనపై ఒక్క కేసు లేదని, గత ఐదేళ్లలో అక్రమ కేసులు అనేకం పెట్టారన్నారు. కుప్పంలో మళ్లీ ప్రశాంతమైన వాతావరణం తీసుకొస్తానన్నారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించి తాగునీటి సమస్య పరిష్కరిస్తానని, హంద్రీనీవా కాల్వ పనులు పూర్తికి ప్రణాళికలు సిద్ధం చేయాలని, వ్యవసాయంలో మెరుగైన విధానాలు తీసుకురావాలని, డెయిరీ, మిల్క్, సిల్క్, హనీ ఉత్పత్తులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కుప్పానికి ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు తెస్తామన్నారు. కుప్పాన్ని ఎడ్యుకేషన్ హబ్ చేస్తానన్నారు. యువతలో నైపుణ్యం పెంచేందుకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తానన్నారు. రైతులకు సబ్సిడీలు అందించడంపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతి డిపార్టుమెంట్ నుంచి పక్కా ప్రణాళికతో రావాలని, నెలల వ్యవధిలోనే కుప్పంలో మార్పు చూపించాలని అధికారులను ఆదేశించారు.

అత్యున్నత ప్రమాణాలతో కుప్పం బస్టాండ్

సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు దేశంలోనే అత్యున్నతమైన ప్రమాణాలు కలిగిన బస్టాండ్‌గా నిర్మిస్తామని రాష్ట్ర రవాణా, క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం కుప్పం ఆర్టీసీ బస్టాండ్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు జి.రవివర్మ, చంద్రశేఖర్, జి.వెంకటేశ్వరరావు, చీఫ్ సివిల్ ఇంజినీర్ యు.శ్రీనివాస్, రీజినల్ మేనేజర్ జితేంద్రనాథ్‌రెడ్డిలతో కలిసి ఐదు కొత్త ఆర్టీసీ బస్సులను మంత్రి ప్రారంభించారు. అనంతరం బస్టాండ్‌ను, డిపోను, గ్యారేజిని పరిశీలించారు. గతంలో రద్దుచేసిన 30 సర్వీసులను పునరుద్ధరించినట్లు ప్రకటించారు. రాబోయే రోజుల్లో కుప్పం నుంచి తమిళనాడు, కర్నాటక, తెలంగాణా రాష్ట్రాలకు సర్వీసులు నడపనున్నట్లు చెప్పారు. ఎన్నికల్లో మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీ ఇచ్చామని, రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒక కమిటీని వేసి కర్నాటక, తెలంగాణా రాష్ట్రాల్లో ఉచిత బస్సు ప్రయాణ అమలు తీరు పరిశీలించి అమలు చేస్తామన్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి కుప్పం నుంచి హైదరాబాద్‌కు, గురువారం ఉదయం 5 గంటలకు కుప్పం నుంచి నెల్లూరుకు వెళ్లే బస్సులను జెండా ఊపి మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డి వై సి యం ఈ. నాగేశ్వరరావు, డిపో మేనేజర్ పెంచాలయ్య పాల్గొన్నారు.

'చరణి'గా చిన్నారికి నామకరణం

శాంతిపురం మండలానికి చెందిన సుధాకర్, ప్రియ దంపతుల రెండో కుమార్తె చిన్నారికి 'చరణి' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా నామకరణం చేశారు. బుధవారం ఆర్ అండ్ బి అతిథిగృహంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ప్రజలు ముఖ్యమంత్రిని కలిసారు. ఈ సందర్భంగా ఈ దంపతులు తన కుమార్తె చిన్నారికి నామకరణం చేయాలని కొరగా, ముద్దులొలికే పాపకు చరణి అని పేరు పెట్టారు. దీంతో దంపతులు సంతోషం వ్యక్తం చేశారు.

846 సమస్యల అర్జీలు

ఆర్ అండ్ బి అతిథిగృహంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ ద్వారా 846 సమస్యలపై అర్జీలు అందాయి. ఉదయాన్నే అర్జీదారులు ఇబ్బంది పడకుండా జిల్లా యంత్రాంగం టిఫిన్, తాగునీరు, మజ్జిగ అందించింది. జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున అర్జీదారులు చంద్రబాబును కలిసేందుకు విచ్చేశారు. చంద్రబాబు స్వయంగా అర్జీలు స్వీకరిస్తూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌కు సూచించారు. తిరుపతి జిల్లా శెట్టిపల్లి పోరాట కమిటీ నాయకులు చంద్రబాబును కలిసి శెట్టిపల్లి సమస్యను పరిష్కరించాలని విన్నవించారు.నాయకులు రాధాక్రిష్ణ, క్రిష్ణ, ఎన్‌డి శ్రీను చంద్రబాబును కలిసిన వారిలో ఉన్నారు.

– గుడిపల్లి మండలం చిన్నగొల్లపల్లి పంచాయతీ పెద్దగొల్లపల్లి గ్రామానికి చెందిన విజయరాజు మూగ చెవిటి (22) గత ఏడాది కొబ్బరిచెట్టు ఎక్కి కిందపడి వెన్నుమొక విరిగింది. ఐదు లక్షలు ఖర్చు చేసినా ఫలితం లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నామని తెలిపారు. పింఛన్, మూడు చక్రాల మోటార్ సైకిల్ మంజూరు చేయాలని సిఎంను కోరారు.

– వి.కోటకు చెందిన కల్యాణ్ (21) గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో మంచానికే పరిమితం అయ్యాడు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం చేయాలని అర్జీని, మెడికల్ బిల్లులను అందజేశారు.

సాదర వీడ్కోలు

రెండు రోజుల పర్యటన కుప్పం నియోజకవర్గంలో ముగించుకున్న సిఎం చంద్రబాబునాయుడు అభిమానులకు అభివాదం చేస్తూ, తిరుగు ప్రయాణమయ్యారు. బుధవారం సాయంత్రం 4.30 గంటలకు పిఇఎస్ మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి బెంగుళూరుకు బయల్దేరి వెళ్లారు. రాష్ట్ర రవాణా శాఖా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, అనంపురం రేంజి డిఐజి పిమోషి, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్‌పి మణికంఠ చందోలు, ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్, ఎంఎల్ఎలు, ఆర్‌డిఒ శ్రీనివాసులు వీడ్కోలు తెలిపిన వారిలో ఉన్నారు.

అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి

మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి : ముఖ్యమంత్రికి సిఐటియు వినతి

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: 42 రోజులు సమ్మె సందర్భంగా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని బుధవారం కుప్పం ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వాడ గంగరాజు, జిల్లా అధ్యక్షురాలు కెపి.లలిత, సీనియర్ నాయకురాలు ప్రమీల మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో 42 రోజులు పాటు సమ్మె చేయడం జరిగిందన్నారు. ఈ సమ్మె సందర్భంగా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే అంగన్వాడీలకు అన్ని రకాల సమస్యలు పరిష్కారం చేస్తామని చెప్పి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, మినీ సెంటర్‌లను మెయిన్ సెంటర్‌గా మార్చాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, బకాయి ఉన్న బిల్లులు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా కుప్పం ప్రాజెక్ట్ అధికారి నిరంతరం అంగన్వాడీలను వేధింపులు గురిచేస్తున్నారని ఆమెపై చర్యలు తీసుకోవాలని అలాగే అంగన్వాడీలకు ఇబ్బందులు గురి చేస్తున్న ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేసి ఒకే యాప్‌ను పెట్టాలని, కొత్త ఫోన్లు ఇవ్వాలని కోరారు. నాయకులు సరళ, శోభ, కస్తూరి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరంలోని దొడ్డిపల్లి మూడవ వార్డు సచివాలయాన్ని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. సచివాలయ పరిధిలో సమస్యలపై స్థానిక నాయకులు, ప్రజలతో చర్చించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వార్డు సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. సచివాలయానికి వచ్చే ప్రజలతో మర్యాద పూర్వకంగా మెలగాలని సూచించారు. 'స్టాప్ డయేరియా క్యాంపెయిన్' కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పక్కగా అమలు చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. గురువారం (రేపు) అన్ని పాఠశాలల్లో చేతుల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని, పోస్టర్లు ప్రదర్శించడంతోపాటు మధ్యాహ్న భోజనానికి ముందు విద్యార్థుల చేతుల శుభ్రం చేయించాలన్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు నళిని, సీఎంఎం గోపి, వార్డు కార్యదర్శిలు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్ల కోసం ఎపోస్ యంత్రాలు

బ్యాంకర్లతో చర్చించిన కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

నగరపాలక సంస్థ పరిధిలో, వార్డు సచివాలయాల్లో ఆస్తి, ఇతర పన్నుల వసూళ్ల కోసం ఎపోస్ (EPOS) యంత్రాలను ప్రవేశపెట్టడంలో భాగంగా కమిషనర్ డాక్టర్ జె.అరుణ బ్యాంకు అధికారులతో చర్చించారు. బుధవారం సాయంత్రం నగరపాలక కార్యాలయంలో బ్యాంకర్లతో సమావేశమై నగరపాలక పరిధిలో జరుగుతున్న వివిధ రకాల పన్నులు వసూళ్లను సరళతరం చేయడం, పారదర్శకత పాటించడం కోసం ఎపోస్ యంత్రాలను అందించేందుకు అవసరమైన సహకారం అందించాలన్నారు. ప్రస్తుతం పన్నులు చెల్లించాలంటే కౌంటర్లలో నగదు రూపంలో చెల్లించాల్సి ఉంది. మరింత సులభంగా ప్రజలు పన్నులు చెల్లించేందుకు వీలుగా ఎపోస్ యంత్రాలను ప్రవేశపెట్టడం ద్వారా వివిధ రకాల బ్యాంకు కార్డులు, ఆన్‌లైన్ ద్వారా పన్నులు చెల్లించే అవకాశం లభిస్తుంది. అక్కడికక్కడే రసీదులు అందించవచ్చు. ఇదే సమయంలో పారదర్శకత పెరుగుతుంది. ఈ విధానం అమలు కోసం నగర పరిధిలోని 50 వార్డు సచివాలయాల్లో ఎపోస్ యంత్రాలను సమకూర్చాలని బ్యాంకులను కోరారు. సమావేశంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

'అసెంబ్లీకి రాకుండా కుంటిసాకులు'

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రజలకు మొహం చూపే ధైర్యం లేక కుంటి సాకులు చెబుతూ శాసనసభకు రాకుండా జగన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నాడని తెలుగుదేశం నాయకులు సురేంద్ర కుమార్, మోహన్‌రాజ్, మోహన్ నాయుడు అన్నారు. బుధవారం స్థానిక టిడిపి జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మొన్న ఈవీఎంల కారణంగానే ఓటమి అన్నాడు.. ఇప్పుడు ప్రతిపక్ష హోదా లేకపోవడం వలనే సభకు రావడం లేదని చెప్పడం సిగ్గుచేటన్నారు. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి కేవలం 23మంది మాత్రమే సభ్యులున్నారు. అందులో ఐదుగురిని లాగేస్తే ప్రతిపక్ష హోదా కూడా మిగలదని నాటి సభలో జగన్ రెడ్డి స్వయంగా చెప్పారని, 18 మంది సభ్యులుంటే ప్రతిపక్ష హోదా ఉండదని ఎద్దేవా చేసి, ఇప్పుడు 11 మంది సభ్యులుంటే ప్రతిపక్ష హోదా కావాలని ఏ విధంగా అడుగుతారని ప్రశ్నించారు. ప్రజాసమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని, ప్రజల గొంతుకై నిలవాలనే ఆలోచన ఉంటే ప్రతిపక్ష హోదా కూడా అవసరం లేదన్నారు. శాసనసభలో సభ్యుడిగా ఉంటే చాలనే విషయం మరిస్తే ఎలా అని ప్రశ్నించారు. గత ఐదు సంవత్సరాల పాలనలో ఏ రోజు కూడా ప్రజల గురించి, ప్రజల సమస్యల గురించి పట్టించుకోకపోవడం వలనే ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదన్నారు.

టమోటా కిలో వంద

- అమాంతంగా పెరిగిన కూరగాయల ధరలు
- అల్లాడుతున్న సామాన్యులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: టమోట కిలో ధర వంద రూపాయలు చేరుకోవడానికి సాగు విస్తీర్ణం తగ్గడంతో పాటు నైరుతి రుతుపవనాలు రావల్సి ఉన్నా గత రెండు వారాలకు పైగా వర్షాలు కురవకపోవడమే కారణమని ఉద్యానవనశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది జూన్, జూలై మాసాల్లో కిలో టమోటా రూ.10 నుంచి 15లకు మించలేదు. కోత కూలీలు కూడా రావడం లేదంటూ టమోటా రైతులు పొలాల్లో వదిలేసే పరిస్థితి చూశాం. అయితే ఈ ఏడాది మొన్నటి వరకు అంటే ఐదు రోజుల క్రితం వరకు కూడా కిలో రూ.30 నుంచి 35లకు అమ్ముడుపోతే ప్రస్తుతం కిలో టమోట రూ.100లు ధర పలుకుతోంది.

అంతా నాసిరకం..

మామిడి, సపోటా, నారింజలకే పరిమితమైన కార్బైడ్ ద్వారా పక్వానికి రాని కాయలను రంగుతేలే పండ్లుగా మార్చి విక్రయిస్తూ వినియోగదారులను మోసం చేసే వ్యాపారులు టమోటాలను కూడా కాల్షియం కార్బైడ్ ద్వారా పక్వానికి రాని టమోటాలను మసిపూసి మారేడు కాయల మార్చి కృత్రిమ రంగు తీసుకొచ్చి వినియోగదార్లకు విక్రయిస్తున్నారు. టమోట ధరలు పెరిగిన నేపథ్యంలో కాల్షియం కార్బైడ్ ద్వారా పక్వానికి తెచ్చిన టమోటా విక్రయాలు బహిరంగ మార్కెట్ విక్రయాలు పెరిగాయి. ఇలా పక్వానికి వచ్చిన టమోటాలు ఒకటి రెండు రోజులు కూడా నిల్వ ఉండటం లేదు. ప్రజల ఆరోగ్యంపై తీవ్రప్రభావం చూపుతాయి. వీటిని నియంత్రించాల్సిన ఆహార భద్రాతా అధికారులు మొద్దునిద్ర వ్యాపారులకు వరంగా మారుతోంది. దీంతో లాభార్జనే ధ్యేయంగా జిల్లాలో దళారులు యథేచ్ఛగా ప్రజాఆరోగ్యగం దెబ్బతినేలా కాల్షియం కార్బైడ్‌తో మగ్గబెట్టిన పండ్లు, టమోటాలు విక్రయిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకునే పరిస్థితి మాత్రం లేదు..

> నిన్న మొన్నటి దాకా కిలో రూ.20 నుంచి 30 రూపాయలు ఉన్న టమోట ఒక్కసారిగా వంద రూపాయలకు చేరుకుంది. టమోట తరహాలోనే మార్కెట్‌లో ఇతర కూరగాయల ధరలు పెరగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఏం కొనాలో.. ఏం తినాలో తెలీక అల్లాడుతున్నారు. ఒక్కసారిగా పెరిగిన కూరగాయల ధరలతో పగలే చుక్కలు కనిపిస్తున్నాయి. ఐదు వందలు ఖర్చు చేసినా సంచి నిండకపోగా ఐదు, ఆరు రకాల కూరగాయలు వచ్చే పరస్థితి లేకుండా పోయింది..

అమాతంగా పెరిగిన ధరలు

టమోటా కిలో వంద రూపాయలు చేరుకోగా అదే కోవలో ఇతర రకాల కూరగాయల ధరలు కూడా అమాతంగా పెరిగాయి. బుధవారం చిత్తూరు కూరగాయల మార్కెట్‌లో కిలో టమోటా రూ. 100, నాసిరకం రూ.80, ముల్లంగి రూ.40, కాకర రూ.80, క్యాబేజి రూ.60, క్యారెట్ రూ.80, బిట్‌రూట్ రూ.60, పచ్చిమిర్చి రూ.100, బెండ రూ.60, వంకాయల రూ.80, అల్లం రూ.200, బీరా రూ. 60, ఉర్లగడ్డ (ఆలు) రూ.80, ఆకు కూరలు కట్టా రూ. 15 నుంచి 20లు. ఇలా అన్ని రకాల కూరగాయల ధరలు అమాతంగా పెరిగాయి. దీంతో పేదలు, సామాన్యులు తమకు వచ్చే అరకొర కూలి డబ్బులతో ఏం కొని తినాలో తెలీని అయోమయంలో పడుతున్నారు.

రూ.500లు పెట్టినా సరిపోవడం లేదు..

- లక్ష్మమ్మ, భవన నిర్మాణ కార్మికురాలు

రోజువారీ కూలి పనులు చేసుకునే మాకు వచ్చే కూలి డబ్బులో సగం డబ్బులు పెట్టినా మూడు పూటలా కడుపు నిండి తినే పరిస్థితి లేకుండా పోయింది. రూ.500లు తీసుకొని మార్కెట్‌కు వెళ్లినా రెండు రోజులకు సరిపడా కూరగాయలు కూడా రావడం లేదు.. పెరిగిన ధరలతో మూడు పూటలా కడుపు నిండి తిండికూడా తినలేకపోతున్నాం..

సామాన్యులు ఎలా బతకాలి..

- శ్రీనివాసులు, ఆటోడ్రైవర్

రోజురోజుకు నిత్యావసరాలు, కూరగాయల ధరలు ఇలా పెరుగుతూపోతే సామాన్యులు ఏం తిని బతకాలి. రోజంతా కష్టపడి సంపాదించినా కనీసం తిండి కూడా తినలేని పరిస్థితిలో ఉన్నాం. ఇక ఇంటి బాడుగులు, పిల్లల చదువులు, ఇతర అవసరాలకు ఏం చేయాలో దిక్కుతోచడం లేదు. ఇకనైనా పేదలను దృష్టిపెట్టుకుని ధరల పెరుగుదలను నియంత్రించాలి.

ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో..

పిఎస్ఎన్ వివేకానంద విజయకేతనం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

బుధవారం విడుదల చేసిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్ష ఫలితాలలో పిఎస్ఎన్ వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ప్రతిభను చాటి విజయకేతనం ఎగురవేశారని పిఎస్ఎన్ వివేకానంద జూనియర్ కళాశాల కరస్పాండెంట్ పి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు అన్ని విభాగాల్లోనూ ఉత్తమ మార్కులు సాధించారని తెలిపారు. నికిత 463, ప్రశాంతి 463, సాహిత 463, దిలీప్ కుమార్ 463, ఐశ్వర్య 463, స్నేహ 463, వాసవి 463, ఉష్రశ్రీ 462, గణేష్ 462, అశ్విత 462, భావన 462 లిఖిత 462, మహాలక్ష్మి 462, కె. లికిత 461, లాస్య 461, హాసిని 461, , మన్యత రెడ్డి 461, పద్మశ్రీ 461, వినీషా 461, రెడ్డి చరిత 461, వినీత 461, పల్లవి 460, మౌనిక 460, పల్లవి శ్రీరామన 460, మహిత కీర్తి 460, లిఖిత 460 ఉత్తమ మార్కులు సాధించారని పేర్కొన్నారు. 466 ముగ్గరు విద్యార్థులు, 465 పదిమంది విద్యార్థులు, 464 9 మంది విద్యార్థులు, 463 12 మంది విద్యార్థులు, 462 ఏడు మంది విద్యార్థులు, 461 తొమ్మిది మంది విద్యార్థులు 460 ఆరు మంది విద్యార్థులు. 460 ఆపై 470 మార్కులు 56 మంది విద్యార్థులు సాధించారని ఇది తమ కళాశాల అధ్యాపకుల కృషి, విద్యార్థుల పట్టుదలకు నిదర్శనమని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించేందుకు కృషిచేసిన అధ్యాపకులకు, విద్యార్థులను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ ప్రిన్సిపాల్ నాగరాజు శెట్టి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఉత్తం మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

అతిసారపై అప్రమత్తంగా ఉండాలి

డిఎంఅండ్‌హెచ్ఒ ప్రభావతిదేవి

జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిఎంఅండ్ హెచ్ఒ ప్రభావతిదేవి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: డయేరియా, అతిసారపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ప్రభావతిదేవి అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలోని వైద్యఅధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, కలుషిత నీటి ద్వారా వచ్చే డయేరియా, అతిసార వంటివి రాకుండా ఎప్పటికప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు ప్రతివారం సిహెచ్ఓల ద్వారా వాటర్ టెస్టింగ్ చేయించాలన్నారు. అలాగే ట్యాంకుల్లో క్లోరినేషన్ జరగాలని, ఇంటింటికీ క్లోరిన్ టాబ్లెట్స్ పంపిణీ చేసి పాట్ క్లోరినేషన్ చేయించాలన్నారు. అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రతి గురువారం తప్పనిసరిగా సర్వే చేసిన పాపులేషన్‌కి టీకాలు వేసి యాప్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. వర్షాకాలంలో నీటినిల్వలతో దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి విషజర్వాలు రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ప్రతిఒక్కరూ బాధ్యతతో పనిచేసి మరణాలు సంభవించకుండా చూడాలన్నారు. కొన్ని జిల్లాలలో సికల్ సెల్ స్క్రీనింగ్ జరుగుతున్నందున ఎప్పటికప్పుడు వాటి అచీవ్మెంట్ పూర్తి చేయాలని, ప్రస్తుతం జరుగుతున్న క్యాన్సర్ స్క్రీనింగ్ ట్రైనింగ్ పూర్తి కాగానే సిహెచ్ఓలు, ఏఎన్ఎంల ద్వారా స్క్రీనింగ్ స్టార్ట్ చేసి బాధితులకు చికిత్స ప్రారంభించాలని ఆదేశించారు. హెచ్‌పిఆర్, ఇహెచ్ఆర్‌లను పూర్తిగా అచీవ్ చేయాలన్నారు. అన్ని డెలివరీ కేసులకు ఆరోగ్యశ్రీ క్లెయిమ్‌లు తప్పనిసరి కంప్లీట్ చేయించాలని సూచించారు. డాక్టర్ వెంకట ప్రసాద్, డాక్టర్ అనిల్, ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

సన్మానం

ప్రజాశక్తి-వెదురుకుప్పం: టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్, మాజీ ఎంపీటీసీ మోహన్ మురళిని ఆ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. మోహన్ మురళి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువలతో సన్మానించారు. పార్టీ విజయానికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. చంద్రబాబు చిత్రపటాన్ని ఆయన బహుకరించారు. వెంకటాద్రి, వాసు, వెంకటేష్, ప్రసాద్‌రాయల్ పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని కీలపట్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్థానిక సర్పంచ్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని, క్రీడల్లో నైపుణ్యం సాధించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా పాఠశాలలో ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనే తన దృష్టికి తీసుకువస్తే తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

అందుబాటులో యూరియా

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: మండలంలోని ఆర్‌బీకే కేంద్రంలో వ్యవసాయ రైతులకు యూరియా అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి వందన తెలిపారు.

వందన

బుధవారం ఆమె మాట్లాడుతూ 53.865మెట్రిక్ టన్నుల యూరియా, 4.75మెట్రిక్ టన్నుల పొటాష్ అందుబాటులో ఉందన్నారు. యూరియా బస్తా రూ.270చొప్పున అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పదండి.. డ్రగ్స్ వినియోగాన్ని అరికడదాం..

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: పెరుగుతున్న డ్రగ్స్‌వినియోగాన్ని అరికట్టాలంటూ యూత్ అసోసియేషన్ సభ్యులు నగరి పట్టణ పరిధిలో ర్యాలీ నిర్వహించారు. బుధవారం ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఏకాంబరకుప్పం రైల్వేస్టేషన్ వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో సీఐ సురేష్ పాల్గొని మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఎన్జీఓ సంస్థలు, అనంతరం యూత్ అసోసియేషన్ సభ్యులు తహశీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. యువకులచేత డ్రగ్స్ వ్యతిరేక ప్రమాణస్వీకారం చేయించారు.

డిగ్రీ కళాశాలలో..

నగరి ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం యుక్త వయస్సులో సంతోషంగా ప్రారంభమై, మధ్యవయస్సులో జీవితం విషాదంతో అంతం అవుతుందన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో కలిసి మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రాంగణం నుంచి డిగ్రీకళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు.

యువత మత్తులో చిత్తు కావద్దు: విజయులురెడ్డి

ప్రజాశక్తి-వెదురుకుప్పం,కార్వేటినగరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, ఎన్సిసి విభాగం, కార్వేటి నగరం ఎన్ఫోర్స్మెంట్ విభాగం సహకారంతో బుధవారం అంతర్జాతీయ మత్తు, మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయులు రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ యువత మత్తులో చిత్తు కావద్దని, ఉన్నత లక్ష్యాలు పెట్టుకుని ఆ దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఎన్ఫోర్స్మెంట్ సబ్ ఇన్స్పెక్టర్ భారతి మాట్లాడుతూ యువత మత్తుని వదిలి ఆరోగ్యకరమైన జీవితాన్ని ఆస్వాదించాలని తెలిపారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ధనంజయరెడ్డి విద్యార్థులతో మత్తు మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞను చేయించారు. కార్యక్రమంలో ఎన్ఫోర్స్మెంట్ సిబ్బంది రాజేష్, కార్తికేయన్, దొరవేలి, గంగా అధ్యాపకులు డాక్టర్ హరిబాబు, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ బాబు, కార్తీక్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సీఐ హరికృష్ణ

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: మాదకద్రవ్యాల ఉపయోగించడం వలన అనారోగ్య సమస్యలు ఎక్కువ అవుతాయని స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సిఐ హరికృష్ణ అన్నారు. బుధవారం బంగారుపాళ్యం మండలం పివిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మురళి ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. సీఐ మాట్లాడుతూ యువతి యువకులను చెడుదారుల నడిపించేందుకు మాదక ద్రవ్యాలు అధికమైపోతున్నాయని వాటిని నివారించేందుకు కట్టుదిట్టమైన చర్యలను చేపడుతున్నట్లు చెప్పారు. మత్తు బారిన పడి జీవితాలను వృథా చేసుకోవద్దని యువతరానికి సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం గౌడ్, కానిస్టేబుళ్లు కిరణ్, శ్వేత, కళాశాల అధ్యాపకులు

ర్యాలీ చేపడుతున్న స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో పోలీసులు

వేలం పాటలో రూ.1.32లక్షల ఆదాయం

ప్రజాశక్తి-సోమల: పంచాయతీలోని వారపు సంత, ప్రైవేటు బస్టాండుకు సంబంధించిన వేలం పాటలో రూ.1.32లక్షలు ఆదాయం వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి మసూదా బేగం తెలిపారు. మండలంలోని పెద్ద ఉప్పం పల్లి పంచాయతీలో బుధవారం వేలం పాట నిర్వహించారు. కాగా వారపు సంతకు సంబంధించి రూ.1.21లక్షలు, ప్రైవేటు బస్టాండు రూ.11వేలు ఆదాయం వచ్చిందన్నారు.

జాతరలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: నగరి మున్సిపాలిటీ పరిధిలోని చింతలపట్టెడ అమ్మవారి జాతర మహోత్సవంలో నగరి ఎమ్మెల్యే గాలిభాను ప్రకాష్ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యేకి జాతర కమిటీ సభ్యులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించి ప్రసాదాలు అందజేశారు.

పిల్లలూ.. బడికి రండి.!

ప్రజాశక్తి-సోమల: బడి మానేసిన చిన్నారులను తిరిగి బడిలో చేర్పించేందుకు నేను బడికి పోతా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎంఈవో శివరత్నమ్మ తెలిపారు. బుధవారం మండలంలోని ఇరికిపెంట పంచాయతీలో పలువురు విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్పించే కార్యక్రమాన్ని చేపట్టారు.

'మీ సేవ' నిర్వాహకులను ఆదుకోండి

- సీఎంకి వినతి

ప్రజాశక్తి-శాంతిపురం: 'మీ సేవ' నిర్వాహకులను ఆదుకోవాలని ఆ సంఘం రాష్ట్ర అసోసియేషన్ తరఫున సీఎం చంద్రబాబుకు విన్నవించారు. కుప్పం పర్యటనలో ఉన్న చంద్రబాబును కలిసి వినతి పత్రం అందజేశారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-సదుం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలోని గొడ్లవారిపల్లి వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సదుం వాల్మీకి వీధికి చెందిన కాగితి రవికుమార్(45) తిరుమల కళ్యాణకట్టలో విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. మండలంలోని గొడ్లవారిపల్లి సమీపంలో ఎరుకుల కాలనీ మలుపు వద్ద బైక్ అదుపుతప్పి పడిపోయాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతినికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఏఎస్ఐ వందన కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టుపై నుంచి పడి యువకుడి మృతి

ప్రజాశక్తి - రామకుప్పం: చెట్టు మీద నుంచి జారిపడి యువకుడు మృతి చెందిన సంఘటన రామకుప్పం మండలంలో చోటు చేసుకుంది.

చంద్ర(ఫైల్ ఫోటో)

మండల పరిధిలోని బందార్లపల్లి పంచాయతీ, వినాయకపురం గ్రామానికి చెందిన చంద్ర(30) మంగళవారం సాయంత్రం ఇంటి దగ్గర ఉన్న వేప చెట్టులో గొర్రెల కోసం ఆకు కోసేందుకు చెట్టు ఎక్కి ఆకుకోసాడు.. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ జారి కింద పడ్డాడు.. అపస్మారక స్థితికి చేరుకున్న అతన్ని ఆటోలో కుప్పం ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గ మధ్యంలో మరణించాడు. దీంతో జరిగిన సంఘటనపై పోలీసులకు అతని భార్య భువనేశ్వరి ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతుడికి భార్య ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు.

టీడిపి నేతల పరామర్శ

చంద్ర మృతిపై మండల టీడీపీ నేతలు సంతాపం వ్యక్తం చేశారు. పార్టీకి చంద్ర నికార్సైన కార్యకర్త అని, అతని మృతి పార్టీకి తీరని లోటని అవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరపున అతని కుటుంబాన్ని ఆదుకొనేలా చూస్తామని నేతలు హామి ఇచ్చారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో మండల టీడీపీ అధ్యక్షులు ఆనందరెడ్డి, నేతలు నందారెడ్డి, మునిరెడ్డి, సుబ్రమణ్యం, మురళి, పెరుమాళ్, చంద్రశేఖర్ రెడ్డి, రంగనాథం, కిరణ్, బాలు, రఘు తదితరులు ఉన్నారు.

బస్సు, కారు ఢీ

- ఇద్దరు బ్రిటిష్ పౌరులకు తీవ్ర గాయాలు
- నుజ్జునుజ్జయిన కారు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: బస్సు, కారు ఢీకొన్న సంఘటన మండలంలోని నరహరిపేట చెక్ పోస్ట్ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. గుడిపాల పోలీసుల కథనం మేరకు.. కారు వేలూరు నుంచి బెంగళూరుకు వెళ్తుండగా చిత్తూరు నుంచి వేలూరుకి వెళ్తున్న ప్రైవేట్ బస్సు ఢీ కొనింది. దీంతో కారులో ఉన్న ఇద్దరు బ్రిటిష్ పౌరులైన అలియా సాదన్, ఇక్బాల్ ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే 108 అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే వారి పరిస్థితి విషమంగా ఉండడంతో రాణిపేటలోని సీఎంసికి తరలించారు. బస్సులోని ప్రయాణికులకు సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదంలో కారు నుజ్జునుజ్జైంది. ఈ ఘటనపై గుడిపాల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ ఫలితాల్లో 'శ్రీ వివేకానంద' విజయకేతనం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఇంటర్మీయట్ బోర్డు బుధవారం విడుదల చేసిన ఇంటర్ ఫస్ట్ ఇయర్ సపలమెంటరీ ఫలితాలలో శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులు అన్ని విభాగంలో ఉత్తమ ఫలితాలు సాధించి విజయదుందుభి మోగించారని కళాశాల కరెస్పాండెంట్ మహేంద్రకుమార్, భాస్కర్ నాయుడులు తెలిపారు. మొదటి సంవత్సరం సప్లమెంటరీ ఎంపిసి విభాగంలో 470మార్కులకు గాను భావన 465, దిశా హరిని 465, కావ్య 464, హిమేష్ వర్ 463, లక్షయ 463, స్వాతి 462, బాలు 462, చక్రదీప్ రెడ్డి 462, మోహిత్ 462, సింధుజా 461, హర్షిత 461, వృత్తిక రాజ్ 461, రాకేష్ 461, చాందిని 460, యోషిత రెడ్డి 460, ఇర్ఫాన్ బాషా 460, శశాంక్ 459, సాయి కృష్ణ 458, లీల ప్రకాష్ 458, భారతి రెడ్డి 458, హేమంత్ 457, హరిక 457, దిషిత 456, జోష్ణ 456, వసు రాజు 456, హర్షిత్ 456, మాధవ్ 456, లిఖిత 456, మహిత 455, సంధ్య 455,

సంతోష్ 455, రిస్మిత 455, పూజ 454, శరత్‌కుమార్ 454, అరుణ్‌కుమార్ 454, హిమశ్రీ 453, దనుశ్రీ 453, సాయి సూర్యతేజ్ 453, గణేష్ 453, సల్మాన్ 453, చందన 452, పూజిత 451, ఉదయశ్రీ 451, సునీత 451, ఉదయ్‌కుమార్ 451, యశ్వంత్ 451, తోయజ 450, కీర్తన 450, అమృత 450, చందన 450, బైపీసీ విభాగంలో గాయత్రి 440, సాయి కిషోర్ 440, శైలు 440, సీఈసీ విభాగంలో జాహ్నవి 480, లోహిత 465, హర్షవర్ధన్ 464, యమునా 464, ఛాయా రత్నం 446, ధనుశ్రీ 445, కీర్తన 433, లావణ్య 430, కిరణ్ 420 మార్కులు సాధించారని తెలిపారు. పై ఫలితాల సాధనలో నిరంతరం కృషి చేసిన అధ్యాపకులకు, సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు కళాశాల యాజమాన్యం వి.మహేంద్ర కుమార్, టి. భాస్కర్ నాయుడు, ప్రిన్సిపాల్ రవీంద్ర రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యానికేతన్‌కు స్టేట్ ర్యాంకు

ప్రజాశక్తి-వికోట: వికోటలోని విద్యానికేతన్ విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించి మండలానికి గర్వకారణంగా నిలిచారు. బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫలితాలలో మొదటి సంవత్సరం విద్యార్థిని యస్మిత ఎంపీసీ గ్రూపులో 470 మార్కులు గాను 465 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించారు. అదేవిధంగా సానియా బైపిసి గ్రూప్‌లో 440 మార్కులకు గాను 435 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించింది. ఈ విధమైన మార్కులు రావడం వీకోట చరిత్రలో ఇదే ప్రథమమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఇటువంటి విజయానికి తోడ్పడిన ఉపాధి బృందానికి, తల్లిదండ్రులకు కరస్పాండెంట్ ఎస్ఆర్ దామోదర్‌రెడ్డి, ఇతర యాజమాన్యం ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఇతర విద్యార్థులు రాబోవు కాలంలో మంచి ఫలితాలు సాధించాలని కోరారు.

ఇంటర్ ఫలితాల్లో శ్రీ సాయి చైతన్య ప్రభంజనం

ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని శ్రీ సాయి చైతన్య కళాశాల విద్యార్థులు బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. ఎంపీసీలో 470మార్కులకు గానూ ఎన్.యమునా 466, ఎస్.హర్షిత 463, జి.దీపిక 461, కే.వెన్నెల 461, ఎన్.జస్వంత్ 460, బైపీసీలో 440 మార్కులకు గానూ మోహన్ కుమార్ 435, శ్రీదేవి 430, సుమయ ఫాతిమా 428, మహాలక్ష్మీ 428, శారదా 427మార్కులు, సీఈసీలో సుమయా 488, సుస్మిత 480, హుమేరా 480, హేమలత 475, దీప్తి 475 మార్కులు, ఎంఈసీలో 500మార్కులకు గానూ గుణశేఖర్ 463, హిమేష్ 459, మిస్బా 443 సాధించి చిత్తూరు జిల్లాలో ఉత్తమమైన స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఇంతటి అత్యున్నతమైన మార్కులతో సాయి శ్రీ చైతన్య జూనియర్ కళాశాల పట్టణంలోనే కళాశాలల కన్నా మొదటి స్థానంలో నిలిచిందని యాజమాన్యం తెలిపింది. ఉత్తమ ఫలితాలు రాబట్టిన విద్యార్థులు, అధ్యాపకులను కరస్పాండెంట్ ఎం.వి.ఆర్.రెడ్డి డైరెక్టర్ కిషోర్, ప్రిన్సిపాల్ ప్రమోద్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

'మధు అండ్ వాణి' విజయదుందుభి

ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని మధు అండ్ వాణి కళాశాలలో ఈ ఏడు మే నెలలో జరిగిన మొదటి సంవత్సరం ఇంటర్ ఫలితాలు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ సిపి శ్రీవాణి తెలిపారు. ఎంపీసీ విద్యార్థులు 470మార్కులకు గానూ ఎం.చేతన466, కరిష్మా 466, జీవన 462, ఫాతిమా 462, మోక్షజ్ఞ 460, తేజస్విని 460 మార్కులు, బైపిసిలో 440గానూ అల్జీన్ 436, జయశ్రీ 434, రోషిని 434, దివ్య 431 మార్కులు, సిఈసిలో 500 గానూ అంజుమ్ 486, నిహా 460, వేణుమాధవ్ 451మార్కులు సాధించారని, వీరితో పాటు 105మంది విద్యార్థులు 400మార్కులు పైగా సాధించినట్లు ప్రిన్సిపల్ వివరించారు. ఈ విజయానికి కారుకులైన అధ్యాపకులను, విద్యార్థులను, తల్లిదండ్రులను అభినందించారు.

బస్సు సర్వీసులు కొనసాగించాలని వినతి

మంత్రికి విన్నవిస్తున్న రామకుప్పం టీడీపీ నేతలు

ప్రజాశక్తి-రామకుప్పం: గుడిపల్లి, శాంతిపురం, రామకుప్పం మండలాల్లో గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో నడిపిస్తున్న ఆర్టీసీ బస్సులను మళ్లీ పునరుద్ధరించాలని మంత్రి రాంప్రసాద్ రెడ్డిని జిల్లా నేత నందా రెడ్డి, ఇతర టిడిపి నేతలు కోరారు. బుధవారం కుప్పంలో సీఎం చంద్రబాబు పర్యటనలో భాగంగా మంత్రి రాంప్రసాద్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కుప్పం కేజిఎఫ్ వయ బెంగళూరు, కుప్పం వయ క్రిష్ణగిరి, రామకుప్పం, 89పెద్దూరు వయా తమిళనాడు రాష్ట్రం వానియంబడి, రామకుప్పం, కేజిఎఫ్ వయ బెంగళూరు ప్రాంతాలకు గతంలో నడిపిస్తున్న ఆర్టీసీ సర్వీసులను యధావిధిగా నడిపించాలని కోరారు. గ్రామాల నుంచి రైతులు కూరగాయల పంటలు సాగు చేసి ఇతర ప్రాంతాలకు తరలించేందుకు గత ప్రభుత్వంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయనకు వివరించారు. దీంతో సానుకూలంగా స్పందించిన మంత్రి గతంలో ఉన్న ఆర్టీసీ బస్సు సర్వీసులు అన్నిటిని యధావిదంగా నడిపించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు. కార్యక్రమంలో మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా, స్థానిక నేతలు అక్బర్ సాబ్, సుబ్రహ్మణ్యం, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకి పట్టు రైతుల సన్మానం

ప్రజాశక్తి-శాంతిపురం: సీఎం చంద్రబాబుని పట్టు రైతులు వినూత్నంగా సత్కరించారు. శాంతిపురం మండల పర్యటనలో ఉన్న సీఎంని పట్టు రైతులు వెంకటాద్రి నాయుడు, శంకర్ రెడ్డితో ఇతర రైతులు పట్టుగుళ్ల హారంతో సత్కరించారు. రెండు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా చిన్నారి దొడ్డి వద్ద హంద్రీనీవా కాలువను వెళ్ళినప్పుడు పట్టు రైతులు సీఎంను కలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పట్టు రైతుల సమస్యలను తెలియజేస్తూ పట్టుపురుగుల పెంపకానికి కోసం అవసరమైన చాకి పురుగుల

సీఎంని సత్కరిస్తున్న రైతులు

కొరత అధికంగా ఉందని ఐదుచోట్ల జాకీ సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే పట్టు పరిశ్రమకు పూర్వవైభవం తీసుకురావాలని విన్నవించారు.

వీకోటలో తిరుపతి ఎమ్మెల్యేకి సన్మానం

ప్రజాశక్తి-వికోట: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ తరపున తిరుపతి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆరని శ్రీనివాసులును వీకోట మండల జనసేన పార్టీ నేతలు ఘనంగా సన్మానించారు. సీఎం చంద్రబాబు కుప్పంలో రెండవ రోజు పర్యటిస్తుండగా వారిని కలిసేందుకు తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు వెళ్లి తిరుగు ప్రయాణంలో బుధవారం వీకోటకు విచ్చేశారు. వారికి స్థానిక జనసేన పార్టీ నాయకులు కేఆర్‌పి ట్రావెల్స్ అధినేత పొట్టు భాస్కర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నేతలు సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి అభివృద్ధికి కృషి



చేస్తానన్నారు. అధినేత పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో పార్టీ అభివృద్ధికి స్థానిక నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారి అభిమానులు మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు ఎం.ఆర్ రాంజనేయులు, వీకోట వార్డు సభ్యులు బీడా బాబుతో ఇతర ప్రముఖులు వారిని కలుసుకొని సన్మానించారు.

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులది కీలక పాత్ర

- జిల్లా ఉప విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులది కీలకపాత్ర అని జిల్లా ఉప విద్యశాఖ అధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆయన బుధవారం బైరెడ్డిపల్లిలో జరిగిన జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం విశ్వనాథయ్య ఉద్యోగ విరమణ వీడ్కోలు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉన్నత స్థాయిలో వున్న ఏ వ్యక్తి అయినా తొలతగా విద్యాలయంలో గురువుల వద్ద విద్యాభ్యాసం చేసినవారేనన్నారు. ఎంతో మందిని ఉన్నతంగా తీర్చిదిద్దే అవకాశం

హెచ్ఎం విశ్వనాథయ్యను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కూడా ఉపాధ్యాయ వృత్తికి ఉందన్నారు. అనంతరం హెచఎం విశ్వనాథయ్య సేవలను ఆయన కొనియాడారు. పలువురు హెచ్ఎంని ఘనంగా సత్కరించారు.

29న ఉచిత గుండె, ఊపిరితిత్తుల వైద్య శిబిరం

ప్రజాశక్తి-సదుం: ఈనెల 29న ఉచిత గుండె, ఊపిరితిత్తుల వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పీలేరు శశి హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ కె.శశిధర్ రెడ్డి, కె.గౌతమ్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సదుం మండలం, అమ్మగారిపల్లె గ్రామం, కలకటవారిపల్లె గ్రామ సచివాలయంలో నిర్వహించనున్న వైద్య శిబిరంలో హృద్రోగ వైద్య నిపుణులు డాక్టర్ పి.సుమంత్ కుమార్ రెడ్డి, పల్మోనాలజీ వైద్యనిపుణులు డాక్టర్ డి.ధరణీశ్వర్ రెడ్డి, ఎమర్జెన్సీ, జనరల్ ఫిజిషియన్, ఐసియు క్రిటికల్ కేర్ ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ కె.శశిధర్ రెడ్డి పాల్గొంటున్నారని అన్నారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో ఉచిత ఈసిజి, కన్సల్టేషన్, న్యూరోపతి స్కాన్, జి.ఆర్.బి.ఎస్, బిఎండి స్కాన్ వైద్య సేవలతో పాటు ఉచిత మందులను కూడా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 9347873739కు సంప్రదించాలని కోరారు.

విదేశీ విద్య పునరుద్ధరణపై సంబరాలు

ప్రజాశక్తి-పుంగనూరు: దళిత వర్గాల విద్య అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం చంద్రబాబుకు 'వందనమంటూ" ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి బుధవారం సీఎం చంద్రబాబుకు అభినందనలు తెలిపారు. విదేశీ విద్యకు అంబేద్కర్ విదేశీ విద్య అని పునరుద్ధరణ చేయడంపై సంబరాలు నిర్వహించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కమిటీ సభ్యులు శ్రీనివాసులు, మహేంద్ర, రాజా, ఎన్ఆర్ అశోక్, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: అనాథ మృతదేహానికి ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. బుధవారం బంగారుపాళ్యం మండలం తగ్గువారిపల్లె స్మశాన వాటికలో అంత్యక్రియలు చేపట్టారు. కాగా గత మూడు రోజులకు ముందు మొగిలి ఘాట్‌లో ఏనుగు దాడిలో మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి మృతి దేహాన్ని మూడు రోజులపాటు ఆసుపత్రిలో ఉంచి సంబంధికులు ఎవరు రాకపోవడంతో స్థానికంగా ఉన్న ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో ఖననం చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రామచంద్రారెడ్డి, పోలీసులు ధనంజయ, ముబారక్, ముస్లిం జేఏసీ అధ్యక్షులు ఫిరోజ్ అహ్మద్, షంషీర్, సమీర్, రియాజ్, బొబ్బర్ మాలిక్ పాల్గొన్నారు.

రాళ్ళబుదుగూరు ఎస్ఐగా నరేష్

ప్రజాశక్తి - శాంతిపురం: రాళ్ళబుదుగూరు నూతన ఎస్ఐగా నరేష్ నియమితు లైయ్యారు. బుధవారం ఆయన పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. కడప జిల్లా ఏసీబీ నుంచి బదిలీపై వచ్చారు.

పుంగనూరుకు ఎమ్మెల్సీ ఇవ్వాలి: సజ్జద్ బాషా

ప్రజాశక్తి-పుంగనూరు: టీడీపీ పాలనలో పుంగనూరు నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్సీ పదవిని కేటాయించాలని జిల్లా ప్రియాంక సేవాదళ్ అధ్యక్షులు సజ్జద్ బాషా బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అయ్యాయన్నారు. రెండు స్థానాలుండగా వాటిలో ఒకటి పుంగనూరుకు కేటాయించాలని కోరారు. టీడీపీ అభ్యర్థి స్వల్ప మెజారిటీతో ఓడిపోయిన నేపథ్యంలో నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్సీ స్థానాన్ని పుంగనూరు కేటాయించాలన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సీఎం హామీ సంతోషదాయకం

ప్రజాశక్తి-పుంగనూరు: ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నానని సీఎం చంద్రబాబు చెప్పడం చాలా సంతోషించ దగ్గ విషయమని ఎంఎస్‌పి జాతీయ నాయకులు నరేంద్ర అన్నారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్లో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పిల ఆధ్వర్యంలో బుధవారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుప్పం పర్యటన సందర్భంగా సీఎం చంద్రబాబు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీపై కుప్పం పర్యటనలో సీఎం మాట్లాతు వర్గీకరణకు కట్టుబడి ఉన్నానని చెప్పారన్నారు. త్వరలో ఎస్సీ వర్గీకరణ జిల్లాల వారిగా అమలు చేస్తామని చెప్పినట్లు తెలిపారు. విదేశీ విద్యను కొనసాగస్తూ అంబేద్కర్ పేరు పునరరుద్ధరణ చేస్తూ జీవో తేవడం ఆనందదాయకం అన్నారు. కుప్పంలో సీఎంని కలసి సన్మానించడానికి వంద మంది కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. నాయకులు మురళి, నరసింహులు, నాగభూషణం, వెంకటరమణ, ప్రభాకర్, హరిబాబు, గోవిందు, రవి, హరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై టాస్క్‌ఫోర్స్

ప్రజాశక్తి-సోమల: ప్రజారోగ్యం దృష్ట్యా జిల్లా వైద్యశాఖ టాస్క్‌ఫోర్స్ టీం ప్రత్యేక దృష్టి సారించింది. సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ ఎర్రనాగులవారిపల్లిలో వైద్యులు విద్యార్థులు, మహిళలకు హెచ్‌బి వైద్య పరీక్షలు చేపట్టారు. ఆరోగ్యం, పరిశుభ్రత పట్ల పలు సూచనలు చేశారు. అనంతరం సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను పరిశీలించారు. అక్కడి రికార్డులను తనిఖీ చేశారు. డిపిఎంవో రామ్మోహన్, సోమల వైద్యాధికారి జయసింహ, సిహెచ్ఓ అమర్నాథ్‌లు విద్యార్థులకు చేసిన హెచ్ బి వైద్య పరీక్షలను పరిశీలించి అనంతరం పలు సూచనలను చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్య కర్తలు పాల్గొన్నారు.

IN THE COURT OF THE 1ST ADDITIONAL CIVIL JUDGE(JUNIOR DIVISION), CHITTOOR
I.A.No. 1180 of 2022
O.S.No.1239 of 2022
Between
Smt. A.Swarnalatha....Petitioner/ Plaintiff
And
V.Narasimha Reddy & 5 others
...Respondents /Defendants
SUMMONS TO THE RESPONDENTS 1 AND 6
1) Y.Narasimha Reddy,
son of late Venkata Reddy, Hindu,aged about 73 years, residing at Enumulavaripalle Village, Agraharam Post,Piler Mandal, Chittoor District, AP**(1st Respondent)**
2) V.Balramaiah,
son of late V.Ranganadaiah, Hindu,aged about 63 years, r/at D.No.195, Street No.500, BRL Balram Layout, C.K Palli Post, Chittoor Town and District, AP **(6th Respondent)**
Sir, Please take notice that the above I.A.No.1180 of 2022 in suit O.S.No.1239 of 2022 is posted to **29-07-2024** for your appearance before the said court .Please be present on the said date before the said court at **10-30 A.M** either in person or through an Advocate and to raise objections if any, failing which the matter will be decided in your absence as exparte.
SRI C. MUNASWAMY
Advocate,Chittoor,Cell: 9949157809

IN THE COURT OF THE 1ST ADDITIONAL CIVIL JUDGE(JUNIOR DIVISION), CHITTOOR
O.S.No.1239 of 2022
Between
Smt. A.Swarnalatha ...Plaintiff
And
V.Narasimha Reddy & 5 others
...Defendants
SUMMONS TO THE DEFENDANTS 1 AND 6
1) Y.Narasimha Reddy,
son of late Venkata Reddy, Hindu,aged about 73 years, residing at Enumulavaripalle Village, Agraharam Post,Piler Mandal, Chittoor District, AP**(1st Defendant)**
2) V.Balramaiah,
son of late V.Ranganadaiah, Hindu,aged about 63 years, r/at D.No.195, Street No.500, BRL Balram Layout, C.K Palli Post, Chittoor Town and District, AP **(6th Defendant)**
Sir, Please take notice that the above suit O.S.No.1239 of 2022 is posted to **29-07-2024** for your appearance before the said court .Please be present on the said date before the said court at **10-30 A.M** either in person or through an Advocate and to raise objections if any, failing which the matter will be decided in your absence as exparte.
SRI C. MUNASWAMY
Advocate,Chittoor,Cell: 9949157809